వడ్లగింజలో బియ్యం గింజ

ఆదివారం సాయంత్రం ఐదు గంటలవేళ "సినిమా కెడదాం పదండి ఏం తోచడం లేదు" ఓ శ్రీమతి శ్రీవారితో అంది.

ఇంటాయన పేపరులో 'సుడోకు' నించి తలెత్తి "లేడికి లేచిందే పరుగన్నట్టు హఠాత్తుగా ఆదివారం ఐదుగంటలకి సినిమా కెడదాం అంటే సినిమాకి టిక్కెట్టు ఎలా దొరుకుతుంది" ఎత్తిన తల మళ్లీ వంగింది పేపరులోకి.

"మహారాజాలా దొరుకుతుంది. మనసుంటే మార్గం ఉంటుంది. కొత్త రిలీజ్ సినిమా వద్దు. కాస్త పాతబడిన దానికి హాయిగా దొరుకుతాయి టిక్కెట్లు. ముందు లేచి తయారవండి" దబాయించింది యిల్లాలు.

"అబ్బ ఆ చెత్త సినిమాలు డబ్బిచ్చి మరీ చూడాలా - అయినా రోజుకి నాలుగు సినిమాలు తక్కువ కాకుండా చూపిస్తున్నా ఇంకేం మిగిలాయి చూడడానికి."

"అబ్బ ఏంటండి, ఎడ్డెం అంటే తెడ్డెం అంటారు. ఎంతయినా పెద్ద తెరమీద చూసినట్లుంటుందా ఇంట్లో టీవీలో చూస్తే - ఏ ఏడాదికో, ఓసారి బుద్ధిపుట్టి అడిగితే నా ముచ్చట తీర్చడానికన్నా సరే అనరు" బుంగమూతి పెట్టింది ఇల్లాలు.

బుంగమూతి పెట్టిన ఇల్లాలు ఏ కొత్తగా పెళ్లయిన ఇరవై ఏళ్ల ముద్దుగుమ్మో, పదహారేళ్ల బాలాకుమారో గాదు. రిటైరయి యింట్లో కూర్చుని 'సుడోకు'లు పూరించు కుంటున్న అరవైమూడేళ్ల భర్తగారికి ఏభై ఎనిమిదేళ్ల ఇల్లాలు రాజేశ్వరి. "ఏమిటి బాబూ. ఆ దిక్కుమాలిన గుడ్డలిప్పుకు ఆడే తైతక్కలు చూడడానికి ఓ రెండొందలు తగలేసుకు వెళ్ళాలా" చిరాగ్గా అన్నాడు మూర్తి అనబడే కేశవమూర్తి.

"గుడ్డలిప్పుకు లైతక్కలాడే సుందరాంగులే మీ మగాళ్లకి నయనానందకరం గదా!" ఓ విసురు విసిరింది యిల్లాలు.

'అవన్నీ యవ్వన వికారాల వయసులో. ఆ స్టేజి దాటి పుష్కరం అయిందిలే. అమ్మా తల్లీ, ఏ పక్కింటి పిన్నిగారితోనో వెళ్లి నన్నిలా వదిలేయ్ నీకు పుణ్యం ఉంటుంది" చిరాగ్గా అన్నాడాయన.

"ఆ దిక్కుమాలిన "డోకులు" ప్రతి పేపర్లో తగలెడ్తున్న వాళ్ళకి బుద్ధిలేదు. మాట పలుకు లేకుండా బెల్లం కొట్టిన రాయిలా బిగుసుకుపోయి ఆ అంకెలు నింపడమే పుణ్యం పురుషార్థంలా రోజంతా నాలుగు పేపర్లు పట్టుకు అతుక్కుపోవడం, లేస్తారా లేవరా – వాదులాటమాని తయారవండి లేదంటే నేనొక్కర్తినే పోతాను" బెదిరించింది యిల్లాలు.

"అమ్మా బతికించావు తల్లీ. హాయిగా నీపాటికి నీ ఇష్టం నా పాటికి నా యిష్టం అంటూ నీ స్వాతంత్ర్యం ప్రకటించేశావు చూడు. ఇంక ఆ మాట మీద నిలబడి నీ యిష్టం వచ్చిన చోటికి హాయిగా తిరిగి రాపో. కావలిస్తే నీవు వచ్చేవేళకి రైస్ కుక్కరు మీటనొక్కేసి అన్నం వండేస్తాను వేడిగా."

"అబ్బే అంత కష్టం వద్దు. వేలికి ఎందుకు పనిచెప్పడం. హాయిగా సుడోకు చేసుకోండి. పెళ్లాం ముచ్చట తీర్చని మొగుడు, కాపుకాయని చెట్టువున్నా లేకపోయినా ఒకటే..." కోపంగా అంది యిల్లాలు.

"ఓసి నీ అఘాయిత్యం కూల. సినిమాకి తీసికెళ్లనంత మాత్రాన మొగుడున్నా లేకపోయినా ఒకటే అనేటంత దూరానికి వచ్చేసారు మీ ఆడవాళ్లు... అనేవన్నీ అంటూ ఏదో మగాళ్లు రాసిరంపాన పెడ్తున్నట్టు గగ్గోలు... 'మొగుడ్ని కొట్టి మొగసాల ఎక్కడం' అంటే ఇదే కాబోలు..."

"ఆపండిక, సినిమాకి రమ్మంటే ఇంతగోల..." విసురుగా వెళ్లిపోయిందావిడ. మరో పదినిమిషాలలో చీర సింగారించుకుని వెడుతున్న రాజేశ్వరిని చూస్తే .. మనసులో కాస్త ఆశ్చర్యపడ్డారాయన. పెళ్లయ్యాక మొదటిసారి ఆవిడ వంటరిగా వెళ్లిందన్నది తట్టాక, పోనీలే తననిబ్బంది పెట్టకుండా ఆవిడ సరదాలు ఆవిడని తీర్చుకోని... అనుకున్నాడా భర్తగారు.

* * * * * *

సినిమానించి చాలా హుషారుగా వచ్చింది రాజేశ్వరి. "మంచి సినిమా మిస్ అయిపోయారు" విలాసంగా ఓ చూపువిసిరి లోపలికెళ్లిపోయింది. "ఓ భోంచేశారన్న మాట. అంతేలెండి. మగాళ్ల కోసం ఆడవాళ్లు ఎదురుచూస్తూ ఆగాలి కాని పెళ్లాల కోసం వేచే మొగుళ్ళు ఎవరు?" నిష్ఠూరంగా అంది.

"చక్కగా సినిమా చూసొచ్చి పైగా దెప్పడాలొకటి. నేను ఎనిమిది గంటలకల్లా తింటానని తెలీదా. నీలా ఈ చిరుతిండి ఆ చిరుతిండి తిననని తెలుసుగా... చద్ది కూడు తిన్నమ్మ మొగుడాకలి ఎరగదన్న సామెతుంది గదా..." ఆయన ఉక్రోషంగా అన్నాడు.

"ఏం చక్కగా మిమ్మల్ని సినిమా చూడద్దన్నానా - చిరుతిళ్ల తినద్దన్నానా. సరే లెండి ... యివాళ నేనొక్కర్తినే సినిమాకి వెళ్లడం ఓ మంచి సరదా అనుభవం సుమండీ.." స్టూలు జరుపుకుని ఆయన పడకకుర్చీ దగ్గరగా కూర్చుని చాలా హుషారుగా అంది వయ్యారాలు పోతూ,ఆవిడ కులుకులు ఓరకంటా చూసి చూడనట్టు చూసి ఏం మాట్లాడలేదు - అడగక పోయినా తనే చెప్తుంది అని తెలిసి "ఏమిటీ, ఎందుకు" అనడిగితే మీ సొమ్మేం పోతుందా. సినిమా కెళ్ళానని కుళ్ల మీకు" అంది నవ్వి. "నిజంగా, మీరు రాకుండా ఒక్కర్తిని వెళ్లడం బాగుంది సుమండీ, యిన్నాళ్లు మిమ్మల్ని బతిమిలాడ్తూ, రానంటే అలుగుతూ వెర్రి మొగంలా వుండి పోయాను - ఈ తెలివి ముందే వుంటే ఎంత బాగుండేదో - "ఆయన్ని ఊరిస్తున్నట్లుంది.

"పోనీలే ఇప్పటికన్నా గ్రహించావుగా... ఇంకేం నీ ఇష్టం వచ్చినట్లు ఊరేగింక" ఉడుకుమోత్తనం ధ్వనించిందా గొంతులో.

"దీనికే ఉడుక్కోకండి. ఇంకా నేచెప్పడం మొదలుపెట్టలేదు - అవునుగాని ఓ మాట చెప్పండి ... నన్ను చూసిన వాళ్లేం అనుకుంటారు చెప్పండి."

అర్థం కానట్లు చూశాడాయన - మళ్లీ రాజేశ్వరి చిలిపిగా "నేనెన్నేళ్ల దానిలా కనిపిస్తాను చెప్పండి" వయ్యారాలు పోయింది. ఆవిడ కులుకులు చూసి చిరాగ్గా "ఏమిటీ గోల, కులికింది చాలు చెప్పు..." అన్నారాయన విసుగ్గా.

"అబ్బ చెప్పండీ... అందరూ నీవు జుత్తుకు రంగేసుకుంటే నలభై ఏళ్లదానిలా ఉన్నావంటారు. మా వాళ్ళంతా... నీ మొహంలో వయసే కనపడదు... అంటున్నారు గదా."

"ఎవరా అన్నది ... రంగేసుకున్నంత మాత్రాన వయసేం దాగదు..."

"అబ్బ మీరు రంగేసుకోరుగా అందుకే మీకు నన్ను చూస్తే అసూయ. ముసలి మొగుడి పడుచుపెళ్లాం అనుకుంటారని నేను వేసుకున్నప్పుడల్లా ఈ వయసులో సింగారాలెందుకు, అని దెప్పేవారు."

"ఏమిటీగోల, సందర్భంలేని ఈ వాగుడేమిటి - సినిమాకి వెళ్లి ఏదో ఊడబొడ్చిన ఘనకార్యం చేసిన దానిలా ఈ ఉపోద్ఘాతాలు ఏమిటి..."

"అబ్బ వినండి. సినిమాకెళ్లానా... మీ గోలతో ఆలస్యంగా బయలుదేరాను. సినిమా మొదలెట్టేశారు. నా సీటు పక్కన యిటు అటు మగాళ్లు... ఆ ఉంటే నాకేం. అమ్మమ్మ అయిన నేనేం చిన్నదాన్నా మగాళ్లంటే. నాకేం, నా కొడుకో తమ్ముడో అనుకుంటూ హాయిగా కూర్చున్నా..." కుతూహలంగా వింటున్న ఆయన మొహంలో రంగులు మారాయి. యింకేం చెప్తుందోనన్నట్లుగా ఆరాటంగా ఎదురుచూశారాయన.

"ఇటు పక్కనున్న ఆయన పాపం పెద్దమనిషే... కాస్త వదిగి కూర్చున్నాడు. ఎడమవైపున్నాడు చూడండి, కాస్త కుర్రకారు - అంటే ఏ ముప్ఫై ముప్ఫై ఐదో ఉండచ్చు... నే కూర్చున్న దగ్గిర నుంచి నా వైపు దొంగచూపులు మొదలు పెట్టాడు. మొదట ఏమిటి కాలేజీ కుర్రపిల్లని చూసినట్లు చూస్తున్నాడని చిరాకనిపించినా తరువాత... ఏదో గమ్మత్తుగా బాగానే వుందనిపించింది. కించిత్తు గర్వమూ అనిపించింది సుమండీ... నేను అమ్మమ్మలా కాక ఆంటీలా వున్నాను గాబోలు, పురుష పుంగవుడిని ఆకర్షించే అందం యింకా ఉందన్న మాట అనుకోగానే గర్వంగా అనిపించింది. 'పెరటిచెట్టు వైద్యానికి పనికి రాదన్నట్టు' యింటి మొగుళ్లు పెళ్లాలని ముసలమ్మలా తీసిపారేస్తారుగదా... అలాంటప్పుడు పరాయి మగాడు దొంగచూపులు చూడడం ఓ ఆడదానికి కించిత్తు ఆనందమే కలిగిస్తుందిగా..."

నవ్వుతూ అంది ఆ యిల్లాలు. వింటున్న భర్తగారి మొహంలో హావభావాలు సెకనుకోసారి మారుతున్నాయి. "సిగ్గులేకుండా, మనవల నెత్తిన దానివి, ఓ కుర్రవెధవ నిన్ను దొంగ చూపులు చూసాడని, చాలా సంబరంగా చెప్పడం కూడానా" నాకెందుకు సిగ్గు... నేనేం తప్పుడు పనిచేశానా... ఎవడో చూస్తే నా తప్పా... అందంగా ఉన్నానని చూసుంటాడు. నేనో అమ్మమ్మనని అతనికెలా తెలుస్తుంది...." విలాసంగా అంది.

"ఇంతే అనుకుంటున్నారా... తరువాత ఏం జరిగిందో చెప్పనా... చెపితే ఉడుక్కుంటారు."

భర్తగారి మొహంలో కొత్తరంగులు వచ్చి చేరాయి. అడగడానికి అహం అడ్డువచ్చి ఆవిడ చెప్పబోయే మాట కోసం అసహనంగా ఎదురు చూశాడాయన.

"ఇంటర్వెల్లో లైట్లు వెలిగాక నా వైపుచూశాడు. ఫరవాలేదు అంటే బాగానే ఉందనుకున్నాడు గాబోలు... బైటికెళ్లి రెండు కూల్ డ్రింకులు తెచ్చాడు. ఒకటి నాకిచ్చి 'తీసుకోండి ఆంటీ' అన్నాడు. వద్దన్నాను. బలవంతపెడితే తీసుకున్నాను." లైటారాక వెనుకనుంచి చెయ్యి వేశాడు. అహో నా భుజం మీద కాదు కుర్చీ మీదే లెండి... ఆ తరువాత కాలు తగిలింది. పాపం కావాలని తగిల్చి ఉండడులెండి. మనిషన్నాక కదలక మెదలక ఎలా కూర్చుంటాడు. సినిమా అయిపోయిందా...

అంటీ మీరెక్కడికి వెళ్లాలి రండి. ఈ రాత్రి వంటరిగా వెడతారా, నా బైక్ మీద దింపేస్తాను అన్నాడు నవ్వుతూ.

"అమ్మో అలా అనగానే భయం వేసింది సుమా..."

"ఏం పళ్లికిలించుకుంటూ మురిసిపోయావుగా... భయమెందుకు స్కూటరెక్కి చక్కగా రావల్సింది." పళ్ల బిగువున అన్నాడాయన.

"నిజంగానే కాసేపు స్కూటరు ముచ్చట తీర్చుకుంటే బాగుండు అనిపించినా బాబోయ్ ఎవరన్నా చూస్తే అనిపించింది..."

"అంటే ఎవరు చూడకపోతే ఎక్కేద్దువన్న మాట...." ఉక్రోషం ధ్వనించింది ఆ గొంతులో.

"ఊరికే అన్నా... ఎక్కుతానేమిటి పరాయి మగాడి స్కూటరు మీద –" కులుకులు పోతూ అంది.

"ఏమో బాబూ యిదే చెప్తూతున్నా - మీరొచ్చినా రాకపోయినా నాకు ఏదన్నా సినిమా చూడాలనిపిస్తే వంటరిగా వెళ్లే ధైర్యం వచ్చేసింది. ఇక మీదట మిమ్మల్ని అడగనే అడగను..." నిష్ఠూరంగా అంటూ లోపలికి వెళ్లిపోయింది.

* * * * * *

"ఏమిటొదినా, రెండు సినిమాలకెళ్లేసరికి నాతోడు అవసరం లేకుండా పోయిందా. అన్నయ్యగారు వచ్చేసరికి నన్ను పక్కకి తోసేసారు–" పక్కింటి సావిత్రి హాస్యం ఆడింది. రాజేశ్వరి కొత్తపెళ్లి కూతురిలా సిగ్గుపడింది. తరువాత కొంటెగా చూస్తూ "మా ఇద్దరిమధ్య నీవెందుకమ్మ తల్లీ పానకంలో పుడకలాగా.."

"బాగానే వుంది ముది వయసులో మీ ముచ్చట్లు ..." సావిత్రి నవ్వింది.

"ముదివయసేమిటి. అరవైలు, ఏభయిలు ముదివయసేంగాదు. మధ్య వయసు ఈ రోజుల్లో. అయినా మరీ చోద్యం గాకపోతే మొగుడితో సినిమాకెళ్లడానికి ఏ వయసయితేనేం..."

"అవును మరి. అందుకే గాబోలు అన్నయ్యగారు, ఈ అందాల పడుచుపెళ్లాన్ని ఎవడేం చేస్తాడోనని భయపడి వెంటపడ్డారు" ఇద్దరూ మనసారా నవ్వుకున్నారు.

(నవ్య, సెప్టెంబరు 9, 2009)